'పెన్షనర్లకు నగదు రహిత చికిత్స అందించాలి'

సుభాష్‌నగర్, జూలై 12: పెన్షనర్లకు అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో నగదు రహిత చికిత్స అందించాలని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం బుచ్చిరెడ్డి కోరారు. శుక్రవారం ప్రెస్‌భవన్‌లో ఆయన విలేకరుల మాటాడుతూ పెన్షనర్ల సమస్యలను గత ప్రభుత్వం పెడచెవిన పెట్టిందన్నారు. బకాయి పడ్డ నాలుగు విడతల కరువు భత్యాన్ని విడుదల చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న మెడికల్ రీయింబర్స్‌మెంటు బిల్లులను చెల్లించాలని, ఐఆర్‌ను 20 శాతానికి పెంచాలని కోరారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, జేఏసీ కన్వీనర్, ఉపాధ్యక్షుడు పద్మారావు, ఈసీ మెంబర్ చక్రపాణి, పెంటయ్య పాల్గొన్నారు.

స్మార్ట్ సిటీ కేంద్రంగా రాజకీయాలు

- పోటాపోటీగా ఫిర్యాదులు..
- కొనసాగుతున్న విచారణలు



కరీంనగర్ టౌన్, జూలై 12: కరీంనగర్‌లో అన్ని పార్టీలు స్మార్ట్‌సిటీ జపం చేస్తున్నాయి. అధికారపార్టీకి చెందిన పాలకవర్గం నగరపాలక సంస్థలో 735 కోట్ల రూపాయలతో స్మార్ట్‌సిటీ పనులను చేశామని, మిగిలిన పెండింగ్ పనులను స్మార్ట్‌సిటీ మిషన్ ఇచ్చిన గడువులోగా పూర్తి చేస్తామని చెబుతోంది. ఇదే పాలక వర్గంలోని అధికార, ప్రతిపక్షాలకు చెందిన పలువురు కార్పొరేటర్లు స్మార్ట్‌సిటీ పనులను నిబంధనల మేరకు చేయలేదని, పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించ లేదని ఆరోపిస్తున్నాయి. కోట్ల రూపాయల అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయని, వీటిపై విచారణ జరిపించాలంటూ మున్సిపల్ కమిషనర్ నుంచి మొదలుకుని కలెక్టర్, సీడీఎం, సీబీఐ, ఏసీబీలాంటి దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేసి దోషులను శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.ఇప్పటికే హౌసింగ్ బోర్డు కాలనీలోని రోడ్లపై వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ పూర్తిచేసి నాణ్యత సరిగా ఉన్నట్టుగానే క్లీన్ చీట్ ఇచ్చారు. జంక్షన్లు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు, ఇతర అభివృద్ధి పనులపై ఇంకా విచారణ జరుగుతోంది.

స్మార్ట్‌సిటీ పనుల గడువు పొడిగింపు

2017లో కేంద్ర ప్రభుత్వం దేశంలోని 100 నగరాలను స్మార్ట్‌సిటీగా ప్రకటించగా అందులో కరీంనగర్‌ను ఎంపిక చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెయ్యి కోట్లతో ఐదేళ్లలో స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు పనులను పూర్తి చేయాల్సి ఉండగా 735 కోట్లతో స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు పనులను చేపట్టారు. 90 శాతం మేరకు పనులు పూర్తయ్యాయి. మరో 10 శాతం పనులు పూర్తిచేయాల్సి ఉంది. జూన్ 30వ తేదీతో స్మార్ట్‌సిటీ మిషన్ గడువు ముగియగా, కేంద్ర ప్రభుత్వం మార్చి 31, 2025 వరకు గడువును పొడగించింది. దీంతో పెండింగ్ పనులన్నీ పూర్తవుతాయని మేయర్ సునీల్‌రావు చెబుతున్నారు.


అక్రమాలపై ఆరోపణలు

నవంబరు 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల వరకు కార్పొరేషన్‌లో గులాబీదండు హవా కొనసాగింది. కాంగ్రెస్ పార్టీకి నగరపాలక సంస్థలో ఒక్క కార్పొరేటర్ కూడా లేక పోవడంతో ఆ పార్టీ నాయకులు, వామపక్షాలు, టీడీపీ, ఇతర పార్టీల నాయకులు స్మార్ట్‌సిటీ పనులు సరిగా చేయలేదని, జంక్షన్ల సుందరీకరణ పనుల్లో అక్రమాలు జరిగాయని, విచారణ జరిపించాలంటూ ఫిర్యాదు చేశాయి. అభివృద్ధిని చూసి ఓర్వలేకనే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారంటూ బీఆర్‌ఎస్ పాలకవర్గం ఎప్పటికప్పుడు ఖండిస్తూ వస్తోంది.

అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటమిపాలై కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో బీఆర్‌ఎస్ పార్టీ కార్పొరేటర్లు స్మార్ట్‌సిటీ పనులపై విమర్శలు గుప్పిస్తున్నారు. మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, ఆయన సమీప బంధువు కార్పొరేటర్ సోహెన్‌సింగ్ కమల్‌జిత్ కౌర్ బహిరంగంగానే విమర్శలు చేస్తూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్ పార్టీకి 12 మంది కార్పొరేటర్లు గుడ్‌బై చెప్పి కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు. మరో ఇద్దరు బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు బీజేపీలో చేరారు. దీంతో కార్పొరేషన్‌లో బీఆర్‌ఎస్ బలం 30కి పడిపోయింది. నగరంలో 60 డివిజన్లు ఉండగా ప్రస్తుతం 30 మంది బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు, 12 మంది కాంగ్రెస్, 11 మంది బీజేపీ, ఏడుగురు ఎంఐఎం కార్పొరేటర్లు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

బీఆర్‌ఎస్ పార్టీకి గుడ్‌బై చెప్పిన కార్పొరేటర్లతోపాటు బీఆర్‌ఎస్ పార్టీలోని మరికొంత మంది కార్పొరేటర్లు కూడా స్మార్ట్‌సిటీ పనులే లక్ష్యంగా ఆరోపణలు, ప్రత్యారోపణలు చేస్తూ విచారణ కోసం ఫిర్యాదు చేస్తున్నారు. ఇటీవల రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్మార్ట్‌సిటీ పనుల్లో భారీగా అవినీతి జరిగిందంటూ అధికారులతో సమీక్ష నిర్వహించి విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ప్రకటించారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన కార్పొరేటర్లు, కాంగ్రెస్‌పార్టీ కరీంనగర్ నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు స్మార్ట్‌సిటీ పనుల్లో అక్రమాలు జరిగాయంటూ ఆరోపించారు. తాజాగా సీపీఎం కూడా మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి స్మార్ట్‌సిటీ పనులపై విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది. ఇలా అన్ని పార్టీలు స్మార్ట్‌సిటీ పనులే కేంద్రంగా రాజకీయాలు చేయడంతో బల్దియాలో పాలకవర్గ ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాజకీయాలు వేడెక్కుతున్నాయి.



జనవరి 30తో ముగియనున్న పాలకవర్గ పదవీకాలం

ప్రస్తుత నగరపాలక సంస్థ పాలకవర్గ పదవీకాలం జనవరి 30, 2025తో ముగియనున్నది. దీంతో ఇప్పటి నుంచే అన్ని రాజకీయ పార్టీలు బల్దియా ఎన్నికలపై దృష్టి పెడుతున్నాయి. స్మార్ట్‌సిటీ, సీఎం హామీ పనులతో కరీంనగర్‌లో దాదాపు వెయ్యి కోట్లకుపైగా వెచ్చించి సుందర నగరంగా తీర్చిదిద్దామని బీఆర్‌ఎస్ నేతలు అంటున్నారు. ఇదే స్మార్ట్‌సిటీ అస్త్రంగా అందులోని లోపాలను, అవినీతిని ఎత్తిచూపుతూ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు గట్టిషాక్ ఇవ్వాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఎంపీ బండి సంజయ్‌కుమార్ కేంద్రమంత్రి కావడంతో బల్దియాపై ప్రత్యేక దృష్టిపెడతారని, బల్దియాపై కాషాపు జెండా ఎగురవేయాలని బీజేపీ నాయకులు పావులు కదుపుతున్నారు. ఇలా ఎవరికివారు, ఆయా పార్టీలు బల్దియా ఎన్నికలకు ఆరు నెలల ముందునుంచే పావులు కదుపుతుండడంతో బల్దియా రాజకీయాలు రోజురోజుకు వేడెక్కుతున్నాయి.

మెరుగైన విద్యుత్ సరఫరా చేస్తాం

ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి



సబ్ స్టేషన్ నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న సీఎండి,. అధికారులు

హుజూరాబాద్‌రూరల్, జూలై 12: విద్యుత్తు వినియోగదారులకు మెరుగైన విద్యుత్‌ను అందిస్తామని ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెద్దపాపయ్యపల్లి 33 కేవీ సబ్ స్టేషన్ నుంచి ఎల్కతుర్తి మండలం కోతుల నడుమ వరకు వేస్తున్న విద్యుత్తు స్తంభాలను ఆయన శుక్రవారం పరిశీ లించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ సరఫరా వేళ ఎలాంటి అంతరాయలు రాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విధులపై ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించవద్దన్నారు. 33/1 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణానికి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్న స్థలాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు.

'ఇందిరమ్మ మహిళా శక్తి'ని సద్వినియోగం చేసుకోవాలి

సైదాపూర్, జూలై 12: రాష్ట్ర ప్రభుత్వం స్వశక్తి సంఘాల మహిళల కోసం ఇందిరమ్మ మహిళా శక్తి కార్యక్రమాలను అమలు చేయబోతున్నదని, ఆ కార్యక్రమాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌వో శ్రీధర్ సూచించారు. శుక్రవారం సైదాపూర్ మండల కేంద్రంలోని స్త్రీ శక్తి సంతోషిమాత మండల సమాఖ్య కార్యాలయంలో గ్రామైక్య సంఘాల అధ్యక్షులు, వీవోఏలకు ఇందిరమ్మ మహిళా శక్తిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆజరైన డీఆర్‌వో శ్రీధర్ మాట్లాడుతూ స్వశక్తి సంఘాల్లో ఉన్న మహిళలు ప్రభుత్వం అందించే నిధులతో వ్యాపారాలను ప్రారంభించుకోవాలన్నారు. ఎంపీడీవో యాదగిరి, ఏపీఎం చెన్నబోయిన కుమారస్వామి, పశు వైద్యాధికారి విజేందర్‌రావు, మండల సమైక్య అధ్యక్షురాలు సమ్ము రజిత పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే శుక్రవారం సభ

కలెక్టర్ పమేలా సత్పతి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

భగత్‌నగర్, జూలై 12: గ్రామాల్లో ప్రజల సమస్యల పరిష్కారానికే శుక్ర వారం సభ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శుక్రవారం కొత్తపల్లి మండలం మల్కాపూర్ గ్రామంలో శుక్రవారం సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల సమస్యల పరి ష్కారానికే అంగన్ వాడీ కేంద్రాల్లో శుక్రవారం సభ నిర్వహిస్తున్నామన్నారు. మహిళల ఆరోగ్య భద్రతతో పాటు సమస్యల పరిష్కారానికి ఇందులో ప్రాధాన్యం ఇస్తామన్నారు. మహిళలు కుటుంబం కోసం ప్రతి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సరైన సమయానికి పోషకాహారం లభించడంతో పాటు వైద్య పరంగా సూచనలు, సలహాలు అందుతాయన్నారు. మహిళల ఆరోగ్య భద్రతతో పాటు వారి సమస్యల పరిష్కారానికి శుక్రవారం సభ వేదికగా నిలుస్తుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సర్కారు అత్యాధునిక సదుపాయాలను కల్పిస్తున్నదన్నారు. ప్రైవేటుకు దీటుగా పనిచేస్తున్నాయన్నారు. ప్రజలంతా వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గర్భిణులు ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లి డబ్బులు ఖర్చు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని రకాల వైద్య సేవలు స్కా నింగ్‌లు, పరీక్షలు నిర్వహిస్తార న్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం వల్ల అనారోగ్య సమ స్యలు దరిచేరవన్నారు. దోమల నియంత్రణకు కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, డీఎంహెచ్‌వో సుజాత, ఎంపీడీవో ప్రభు, సీడీపీవో ఉమారాణి, చైల్డ్ లైన్ 1098 జిల్లా కో ఆర్డినేటర్ సంపత్, మహిళా శక్తి కో ఆర్డినేటర్ శ్రీలత, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, సూపర్‌వైజర్ అరుణ పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

సుభాష్‌నగర్, జూలై 12: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్, కార్యదర్శి గజ్జల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ చౌక్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి, కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో రెండున్నరేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లకు సంబంధించిన ఎనిమిది వేల కోట్ల రూపాయలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. విద్యార్థులను కళాశాల యాజమాన్యాలు ఫీజుల కోసం ఇబ్బందులు పెడుతున్నాయని, ఫీజు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామని వేధిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి బడ్జెట్ కేటాయించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు శిథిలావస్థలో ఉన్నాయని, వాటి స్థానంలో కొత్త వాటిని నిర్మించాలన్నారు. పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు సరిపడా లేవని, వాటిని శుభ్రపరిచే స్కావెంజర్ లేని పరిస్థితి నెలకొందన్నారు. ప్రతి పాఠ శాలలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలన్నారు. సంక్షేమ శాఖ మంత్రి సొంత జిల్లా అయినా ఏనాడు హాస్టళ్లను సమీ క్షించింది లేదన్నారు. నగరంలో ఏడు సంక్షేమ హాస్టళ్లు ఉంటే అందులో ఏ ఒక్క దానికి సొంత భవనం లేదన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోతున్నాయని, హాస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మోటిక్స్ చార్జీలు మాత్రం పెంచడం లేదన్నారు. రానున్న బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రోహిత్, అభిలాష్, జిల్లా సహాయ కార్యదర్శులు బోగేశ్, శ్రీజ, నగర అధ్యక్షుడు ఈశాక్, సందేశ్, సుస్మిత, సందీప్, తరుణ్, గిరిచరణ్, చంటి సుధీర్, ఆకాశ్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

హుజూరాబాద్ మాధవి నర్సింగ్ హోమ్ సీజ్

- ఆసుపత్రిలోని స్కానింగ్ సెంటర్‌లోని రికార్డులను పరిశీలించిన జిల్లా వైద్యాధికారులు
- లింగనిర్ధారణ, భ్రూణహత్యలపై కలెక్టర్ సీరియస్
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

హుజూరాబాద్, జూలై 12: హుజూరాబాద్ పట్టణంలోని మాధవి నర్సింగ్ హోమ్‌ను శుక్రవారం రాత్రి డీఎంహెచ్‌వో సుజాత సీజ్ చేశారు. హుస్నాబాద్‌కు చెందిన ఓ వివాహితకు భ్రూణహత్య చేసిన కేసులో హుస్నాబాద్ పోలీసులు మాధవి నర్సింగ్ హోమ్‌లో పనిచేసే సిబ్బందిని రెండు రోజుల క్రితం అరెస్టు చేశారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో సుజాత

ఈ విషయం 'ఆంధ్రజ్యోతి'లో గుట్టుగా లింగనిర్ధారణ పరీక్షలు అనే వార్త ప్రచురి తమైంది. దీనికి స్పందించిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విచారణ జరపాలని కలెక్టర్ పమేలా సత్పతిని ఆదేశించారు. దీంతో కలెక్టర్ డీఎంహెచ్‌వో సుజాతను తనిఖీ చేయాలని ఆదేశించారు. డీఎంహెచ్‌వో శుక్రవారం హుజూరాబాద్ మాధవి నర్సింగ్ హోమ్‌కు వచ్చి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీవిద్యను ఆస్పత్రికి పిలిపించుకొని విచారించారు. లింగనిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ సెంటర్, రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం డీఎంహెచ్‌వో సుజాత మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్పత్రుల్లో లింగనిర్ధారణ, భ్రూణహత్యలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

మాధవి నర్సింగ్ హోమ్ ఆస్పత్రిలో రికార్డులు సక్రమంగా లేకపోవడంతో ఆస్పత్రిని సీజ్ చేయడంతో పాటు లైసెన్స్‌ను రద్దు చేశామన్నారు. హుజూరాబాద్, జమ్మికుంటలోని పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హుజూరాబాద్, జమ్మికుంట పోలీసులు ప్రైవేట్ ఆస్పత్రులపై నిఘా పెట్టామని సీపీకి లేఖ రాస్తామని తెలిపారు. హుస్నాబాద్‌కు చెందిన వివాహితకు భ్రూణ హత్య ఎవరు చేశారో పోలీసుల విచారణలో తెలుతుందన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో పనిచేస్తూ ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లు నడిపిస్తున్న వైద్యుల వివరాలు సేకరిస్తున్నామన్నారు. పూర్తి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంసీహెచ్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సనా జూవేరియా, జిల్లా మాస్ మీడియా ఆఫీసర్ రంగారెడ్డి, స్టేటికల్ ఆఫీసర్ కాంతారావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సాజిద్‌హుస్సేన్, జిల్లా హెల్త్ ఎడ్యుకేషన్ పంజాల ప్రతాప్ పాల్గొన్నారు.



హుజూరాబాద్‌లో మాధవి నర్సింగ్ హోమ్ సీజ్ చేస్తున్న డీఎంహెచ్‌వో సుజాత

ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు..

రోడ్డుపై పాదచారులు..

- యథేచ్ఛగా ఫుట్‌పాత్‌ల ఆక్రమణ
- పట్టించుకోని అధికారయంత్రాంగం





ఫుట్‌పాత్‌లపైన సామగ్రి ఉంచిన వ్యాపారులు

కరీంనగర్ అర్బన్, జూలై 12: కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురవుతున్నాయి. ఫుట్‌పాత్‌లపై వ్యాపారులు దుకాణాలు, పండ్ల బండ్లు, కొబ్బరిబోండాల బండ్లు, హోటళ్లు, మిర్చిబండ్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో పాదచారులు రోడ్లపై నడవాల్సి వస్తోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ చిక్కులు ఎదురవుతున్నాయి. ఇలాంటి దుకాణాలు పూర్తిగా తొలగించి ప్రత్యేక స్థలాల్లో చిరు వ్యాపారాలు నిర్వహించుకునేలా మున్సిపల్, పోలీసుశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కూరగాయల మార్కెట్‌రోడ్, రాజీవ్‌చౌక్, రాంనగర్, మంకమ్మతోట, కోర్టు రోడ్, మంచిర్యాల చౌరస్తా, కార్ఖానగడ్డ, కలెక్టరేట్ రోడ్ తదితర ప్రధాన రోడ్లపై ఫుల్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారులు వారి సామగ్రిని పెడుతున్నారు. దీంతో పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. ప్రమాదాలబారిన పడుతూ గాయాల పాలవుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ సిబ్బంది ఫుట్‌పాత్‌ల ఆక్రమణను పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. అప్పుడప్పుడు మున్సిపల్ అధికారులు, పోలీసులు కలిసి ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగిస్తున్నప్పటికీ రెండు మూడు రోజుల తరువాత యథావిధిగా దుకాణాలు ఏర్పాటవుతున్నాయి. ముఖ్యంగా టవర్‌సర్కిల్, రాజీవ్ చౌక్, కూరగాయల మార్కెట్, గాంధీరోడ్, కోర్టు, మంచిర్యాల చౌరస్తారోడ్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు రద్దీ విపరీతంగా ఉంటుంది. నగరంలో వాహనాల పార్కింగ్ పెద్ద సమస్యగా మారింది. ఒకవైపు రోడ్లపై వాహనాలు, మరో వైపు ఫుట్‌పాత్‌ల ఆక్రమణలతో పాదచారులు నడవలేని స్థితి నెలకొంది. చిరు వ్యాపారులకు జోన్‌లను ఏర్పాటు చేసి అక్కడే వారి వ్యాపారాలు నిర్వహించుకునేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని, వాహనాల పార్కింగ్ స్థలాలను గుర్తించి అమలు చేయాలని నగర ప్రజలు కోరుతున్నారు.



పోస్టాఫీస్ మార్గంలో రోడ్లపైనే వ్యాపారాలు

ఎల్‌ఎల్‌బీ సెమిస్టర్ పరీక్షలు ఒకేసారి నిర్వహించాలి

గణేశ్‌నగర్, జూలై 12: శాతవాహన యూనివర్సిటీ(ఎస్‌యూ)లో ఎల్‌ఎల్‌బీ అన్ని సెమిస్టర్ పరీక్షలు ఒకేసారి నిర్వాహించాలని శాతవాహన యూనివర్సిటీ రిజిస్టర్‌కు శుక్రవారం లా విద్యార్థులు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా సీహెచ్ రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడు తూ ఆల్ ఇండియా బార్ కౌన్సిల్ ఎగ్జామ్స్ ఎన్‌రోల్‌మెంట్ కావాలంటే అన్ని సెమిస్టర్లు పాసై ఉండాలన్నారు. విద్యార్థుల సంవత్సర సమ యం వృధా కాకుండా, ఈ విద్యాసంవత్సరంలోనే అన్ని సెమిస్టర్లకు ఒక అవకాశం ఇవ్వాలని రిజిస్టర్‌ను కోరామన్నారు. కార్యక్రమంలో కొట్టే రమేష్, గాండ్ల అజయ్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న లా విద్యార్థులు

సౌరశక్తిని ప్రత్యామ్నాయంగా వినియోగించాలి

- పర్యావరణవేత్త, సైక్లిస్ట్ పంకజ్ మెహ్లా



పంకజ్ మెహ్లాను సన్మానిస్తున్న ఎస్సారార్ ప్రిన్సిపాల్ రామకృష్ణ

గణేశ్‌నగర్, జూలై 12: క్రమక్రమంగా పచ్చని అడవులు అంతరించి పోవడం, బొగ్గు, పెట్రోల్, డీజిల్ తదితర ఇందనాల వల్ల వాతావరణ కాలుష్యం పెరిగిపోవడం వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోందని, సౌరశక్తిని ప్రత్యామ్నాయంగా వినియోగించాలని పర్యావరణవేత్త సైక్లిస్ట్ పంకజ్ మెహ్లా అన్నారు. శుక్రవారం ఎస్సారార్ ప్రభుత్వ కళాశాలకు చేరుకొని అధ్యాపకులకు, విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణకు చేయవలసి న కృషిని వివరించారు. ప్రతిఒక్కరూ సౌరశక్తిని వినియోగించడం ప్రారంభిస్తే పర్యావరణాన్ని కాపాడుకోగలమని సైక్లిస్ట్ పంకజ్ మెహ్లా సైకిల్ ద్వారా కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు నాలుగువేల కిలోమీటర్లు పర్యట న చేస్తూ అందరికీ అవగాహన కల్పిస్తున్నారు. పంజాబ్ హిసార్‌కు చెందిన పంజాబ్ ఇంజనీరింగ్ కళాశాల మూడో సంవత్సరం విద్యార్థి పంకజ్ మెహ్లా 55 రోజులుగా దేశంలోని వివిధ ప్రాంతాల్లో సౌరశక్తిని అందరూ వినియోగించేలా ప్రచారం చేస్తున్నారు. పంకజ్ మెహ్లాను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె రామకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ టి రాజయ్య, స్టాఫ్ సెక్రటరీ డాక్టర్ ఎ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ అధికారులు, విద్యార్థులు అభినందించారు.

ఉత్తర తెలంగాణ నిధులను దుర్వినియోగం చేయవద్దు

సుభాష్‌నగర్, జూలై 12: ఉత్తర తెలంగాణ ప్రాంతంలోని నీళ్ళు, నిధులు, ఖనిజ సంపదను దుర్వినియోగం చేయవద్దని ప్రొఫెసర్ ఏకు తిరుపతి అన్నారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు పీపుల్స్ మూమెంట్ సంస్థ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తర తెలంగాణకు చెందిన 40మంది ప్రసిద్ధ గాయకులకు ఉద్యమ గాన కోకిల పురస్కారంతో సన్మానించారు. అనంతరం ప్రొఫెసర్ ఏకు తిరుపతి మాట్లాడుతూ గోదావరి పరివాహక ప్రాంతాల్లో నీళ్లు, బొగ్గు, విద్యుత్తు, ఇసుక, క్వారీ వంటి అనేక సంపదలు విరివిగా ఉన్నాయన్నారు. వాటిని ఈ ప్రాంతానికే కేటాయించాలన్నారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు మేకల చంద్రశేఖర్, మార్వాడి సుదర్శన్, ముక్కెర సంపత్‌కుమార్, అన్నబోయిన ప్రశాంత్ పాల్గొన్నారు.

ఇల్లందకుంట/జమ్మికుంట: మండలంలోని కనగర్తికి చెందిన రామంచ భరత్‌కు ఉద్యమ గానకోకిల పురస్కారం అందుకున్నారు. ఉత్తర తెలంగాణ పీపుల్స్ మూ మెంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు మేకల చంద్రశేఖర్‌యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముక్కెర సంపత్ శుక్రవారం కరీంనగర్‌లోని ప్రెస్ భవన్‌లో ఉత్తర తెలంగాణ పీపుల్స్ మూమెంట్ ఉద్యమసంస్థ ఆవిర్భావం సందర్భంగా రామంచ భరత్‌కు ఉద్యమ గానకోకిల పురస్కారాన్ని అందజేసి శాలువాతో సన్మానించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


పొలాడి సాయికుమార్ (ఫైల్)

కరీంనగర్ క్రైం, జూలై 12: కరీంనగర్ కోతిరాంపూర్‌లో శుక్రవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదంలో బొమ్మకల్ గ్రామం కృష్ణనగర్ కాలనీకి చెందిన పొలాడి సాయికుమార్ (26) మృతి చెందాడు. అతడి స్నేహితుడు కత్తెర్ల అరవింద్‌కు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... సాయికుమార్, అరవింద్ బైక్‌పై అల్గునూర్ నుంచి కరీంనగర్‌కు వస్తుండగా కోతిరాంపూర్ వద్ద రోడ్డు పక్కన పార్క్ చేసిన వ్యాన్‌ను ఢీకొన్నారు. దీంతో సాయికుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన అరవింద్‌ను 108 సిబ్బంది అన్వేష్, మనోహర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. వ్యాన్ పార్కింగ్ లైట్లు వేసుకోకుండా నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా రోడ్డు పక్కన పార్క్ చేయటంతో చీకట్లో వ్యాన్‌ను వెనుక నుంచి బైక్ ఢీకొట్టిందని మృతుడి తండ్రి మహేందర్ పోలీసులకు ఫిర్యాదు చేశా డు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

వేములవాడ రూరల్, జూలై 12: మండలంలోని నూకలమర్రికి చెందిన ఓ యువకుడు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకా రం.. నూకలమర్రి గ్రామానికి చెందిన పాలకుర్తి ప్రశాంత్(20) అదే గ్రామానికి చెందిన యువతిని ప్రేమించాడు. తన ప్రేమ విఫలమవుతుందేమోనని భయంతో వారం రోజుల క్రితం గడ్డి మందుతాగాడు. కుటుంబ సభ్యులు ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు. ప్రశాంత్ కుటుంబసభ్యులు ఆ యువతి ఇంటి ఎదుట మృతదేహంతో ఆందోళన నిర్వహించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రశాంత్ కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

సిరిసిల్ల క్రైం, జూలై 12: తంగళ్లపల్లి మండలంలోని రాళ్లపేటకు చెందిన ఇలవేని నవీన్ అనే వ్యక్తికి ఓ హత్య కేసులో జీవిత ఖైదు, రెండు వేల రూపాయల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్ ప్రేమలత శుక్రవారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ వివరాల ప్రకారం.. తంగళ్లపల్లి మండలంలోని రాళ్లపేటకు చెందిన ఇలవేణి స్వప్నకు ఆమె మరది అయిన నవీన్ మధ్య తరుచు గొడవలు జరిగేవి. ఈ క్రమంలో 2020 సెప్టెంబరు 7న ఇద్దరి మధ్య గొడవ జరిగింది. స్వప్న తండ్రి గీస రాములు వీరిని అడ్డుకునే ప్రయత్నం చేశాడు. కోపోద్రిక్తుడైన నవీన్ పారతో రాములు తలపై కొట్టాడు. తీవ్రంగా గాయపడిన రాములును ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు తంగళ్లపల్లి పోలీసులు కేసు నమోదుచేసి నవీన్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి సీఐ సర్వర్ కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. పీపీ నర్సింగరావు కేసు వాదించారు. కోర్టు మానిటరింగ్ ఎస్ఐ రవీందర్‌నాయుడు ఆధ్వర్యంలో కానిస్టేబుల్ నరెందర్ కోర్టులో 13 మంది సాక్షులను ప్రవేశపెట్టారు. నేరం రుజువు కావడంతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత నవీన్‌కు జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

● జగిత్యాలో మరొకరికి..

జగిత్యాల టౌన్: డబ్బుల విషయం, భూమి తగాదాల్లో కట్టుకున్న భార్యను కత్తితో పొడిచి హత్య చేసి, అడ్డువచ్చిన కూతురిని గాయపరిచిన కేసులో తండ్రికి జీవిత ఖైదు జైలు శిక్షతోపాటు 6,500 రూపాయల జరిమానా విధిస్తూ జగిత్యాల కోర్టు అడిషనల్ సెషన్స్ జడ్జి నారాయణ శుక్రవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం జగిత్యాల జిల్లాలోని పెగడపల్లి మండలం దోమలకుంటకు చెందిన నక్క గంగవ్వకు అదే గ్రామానికి చెందిన నక్క రమేష్‌తో వివాహం జరిగింది. వీరికి కూతురు, కుమారుడు ఉన్నారు. రమేష్ ఉపాధి కోసం గల్ఫ్‌కు వెళ్లినప్పటికీ భార్య, పిల్లల పోషణకు డబ్బులు పంపలేదు. స్వదేశానికి వచ్చిన రమేష్‌ను డబ్బుల విషయంపై భార్య గంగవ్వ, కుమారుడు జలందర్ నిలదీశారు. దీంతో రమేష్ తన డబ్బులను తన సోదరి పద్మకు పంపించానని, తాను సంపాదించిన డబ్బులు అడిగే హక్కు మీకు లేదని చెప్పాడు. అనంతరం రమేష్ తన సోదరి ఇంటికి వెళ్లి అక్కడే ఉండేవాడు. 2020 నవంబరు 13న పాత పగలు మనసులో పెట్టుకుని కుమారుడు జలందర్‌ను కత్తితో పొడిచి హత్య చేశాసిన రమేష్ జైలు శిక్ష అనుభవించాడు. జైలు నుంచి తిరిగి బెయిల్‌పై వచ్చిన రమేష్ నడవడికలో మార్పు రాలేదు. పాత పగలు మనుసులో పెట్టుకుని 2022 డిసెంబర్ 18న తన భార్య గంగవ్వను కత్తితో పొడవడంతో పాటు అడ్డుగా వచ్చిన కూతురు స్నేహపై కూడా దాడికి పాల్పడ్డాడు. తీవ్ర గాయాలైన గంగవ్వ మృతి చెందగా స్వల్ప గాయాలతో బయటపడ్డ కూతురు స్నేహ అదే రోజు పెగడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి సీఐ రాంమూర్తి కేసు నమోదు చేయగా కోర్టు డ్యూటీ అధికారులు కిరణ్‌కుమార్, సాగర్‌లు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశ పెట్టారు. అదనపు పీపీ మల్లికార్జున్ కేసు వాదించగా నేరం రుజువు కావడంతో నిందితుడు రమేష్‌కు జీవిత ఖైదు విధించారు.

కరీంనగర్ కోర్టుకు
మావోయిస్టు పొలిట్ బ్యూరో సభ్యుడు అమిత్‌బాగ్చి

కరీంనగర్ క్రైం, జూలై 12 : మావోయిస్టు పోలిట్‌బ్యూరో సభ్యుడు అమిత్‌బాగ్చి అలియాస్ అమిత్‌ను కరీంనగర్ రూరల్ పోలీసులు శుక్రవారం కరీంనగర్ కోర్టులో హాజరుపరిచారు. అనంతరం కోర్టు ఆదేశాలతో చర్లపల్లి జైలుకు తరలించారు. అమిత్‌బాగ్చితోపాటు మరికొందరు ప్రభుత్వంపై కుట్రచేశారని 2008లో కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో 2018లో ఒకసారి అమిత్‌బాగ్చిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. అమిత్‌బాగ్చి అప్పటి నుంచి కోర్టు వాయిదాలకు హాజరుకాలేదు. దీంతో కోర్టు వారెంట్ జారీ చేసింది. జార్ఖండ్ రాష్ట్రం రాంచి జైలులో ఉన్న అమిత్‌బాగ్చిని కరీంనగర్ రూరల్ పోలీసులు పీటీ వారెంట్‌పై కరీంనగర్‌కు తీసుకువచ్చి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షల అనంతరం కోర్టులో హాజరుపరచి, చర్లపల్లి జైలుకు తరలించారు.

భూమి అమ్మిన డబ్బులు ఇవ్వడం లేదని ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న దేవరాజు

చందుర్తి జూలై 12: చందుర్తి మండలం మర్రిగడ్డలో భూమి అమ్మిన డబ్బులు తనకు ఇవ్వలేదని ఓ వ్యక్తి శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గ్రామస్థులు, కుటుంబ సభ్యుల కథ నం ప్రకారం.. రామన్నపేటకు చెందిన దుమ్మ దేవరాజు ఇదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి తన భూమిని రెండు సంవత్సరాల క్రితం విక్రయించాడు. కొన్ని డబ్బులు చెల్లించిన కొనుగోలుదారుడు మిగిలిన డబ్బులను ఇవ్వడం లేదు. రెండేళ్లుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని మనోవేదనకు గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయమై చందుర్తి ఎస్సై శ్రీకాంత్ మాట్లాడుతూ బాధితుడు 100 నంబర్‌కు డయల్ చేసి తనను హత్య చేయడానికి ప్రయత్ని స్తున్నారని చెప్పడంతో పోలీసులు అక్కడికి వెళ్లారని చెప్పారు. పురుగుల మందు డబ్బాతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా పోలీసులు వెంటనే 108లో వేముల వాడ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

సస్పెండ్ చేశారని ఆర్టీసీ డ్రైవర్..


చికిత్స పొందుతున్న సీహెచ్‌ఎం రెడ్డి

భగత్‌నగర్, జూలై 12: కరీంనగర్-1 డిపోకు చెందిన సీహెచ్‌ఎం రెడ్డి అనే ఆర్టీసీ డ్రైవర్ శుక్రవారం ఆత్మహత్యాయత్నం చేశాడు. నాలుగు రోజుల క్రితం అల్కహాల్ పరీక్షలో 21 శాతం నమోదు కావడంతో అధికారులు అతడిని సస్పెండ్ చేశారు. శుక్రవారం ఉదయం డిపోకు వచ్చిన సీహెచ్‌ఎం రెడ్డి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. వెంటనే అతనిని కరీంనగర్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సీహెచ్‌ఎం రెడ్డిని ఆర్టీసీ జోనల్ ఈడీ వినోద్‌కుమార్, ఆర్టీసీ అధికారులు పరామర్శించారు.

వివాహిత ఆత్మహత్య

మల్యాల, జూలై 12: మండలంలోని నూకపల్లికి చెందిన ఓ వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఓలపు స్వప్న (35) అనే మహిళ భర్త నర్సయ్య ఉపాధి కోసం విదేశాలకు వెళ్లాడు. కూతురు, అత్తమామలతో కలిసి నూకపల్లిలో ఉంటున్న స్వప్న భర్త కోసం మానసిక వేదనకు గురవుతూ ఎడబాటు భరించలేక శుక్రవారం ఇంట్లోనే ఉరి వేసుకుంది. స్వప్నకు ఏడేళ్ల కూతురు ఉంది. స్వప్న తండ్రి పర్శరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కరీంనగర్‌లో ముంబై పోలీసులు

● రెండు రోజులపాటు పలు కాలనీల్లో విస్తృత తనిఖీలు ● పలువురి విచారణ.. ఒకరి అరెస్టు ● ట్రాన్సిట్ వారెంట్‌పై ముంబైకి తరలింపు



కరీంనగర్ క్రైం, జూలై 12: సైబర్ నేరగాళ్ల కోసం ముంబై ఈస్ట్ రీజియన్ సైబర్ వింగ్ పోలీసులు గురువారం, శుక్రవారం రెండు రోజులు కరీంనగర్‌లోనే మకాం వేశారు. అంతర్జాతీయ సైబర్ నేరగాళ్లతో చేతులు కలిపి కొందరు కరీంనగర్‌లో ఒక డొల్ల కంపెనీ పేరిట జాయింట్ బ్యాంక్ అకౌంట్ తెరిచి డబ్బులు బదిలీ చేశారని వారి విచారణలో తేలింది. కరీంనగర్‌కు చెందిన కొందరు వ్యక్తులు ఈ కేసులో నిందితులుగా ఉన్నారు. వారిని పట్టుకునేందుకు ముంబై పోలీసులు కరీంనగర్‌లోని ఆదర్శ నగర్, హుస్సేనిపుర, సుభాష్‌నగర్, అశోక్ నగర్ తదితర ప్రాంతాల్లో స్థానిక పోలీసుల సహాయంతో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అనుమానితులు నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. విచారణ నిర్వ హించి కొందరిని వదిలిపెట్టారు. మరో ఇద్దరు నిందితులు పరారయినట్లు తెలిసింది. శుక్రవారం కరీంనగర్‌కు చెందిన అహ్మద్‌ఖాన్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్న ముంబాయి సైబర్ క్రైం పోలీసులు అతడిని కరీంనగర్ కోర్టులో హాజరుపరచి ట్రాన్సిట్ వారెంట్‌పై ముంబైకి తీసుకువెళ్లారు. అక్కడి కోర్టులో హాజరుపరచనున్నారు. మార్చి నెలలో ముంబైలో ఓ బాధితుడి ఫిర్యాదుతో నమోదైన సైబర్ క్రైం కేసులో కరీంనగర్ లోని ఒక ప్రైవేట్ బ్యాంక్‌లో మందాని ఇంపాడ్ పూర్ వెల్ఫేర్ ట్రస్ట్ సంస్థ పేరిట సెక్రెటరీ, ట్రెజరర్, సభ్యులు మొత్తం ఏడుగురి పేరిట జాయింట్ బ్యాంక్ అకౌంట్ తెరిచారు. ఈ ఖాతాలోకి సైబర్ క్రైంకు సంబంధించిన భారీ మొత్తంలో డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేసినట్లు ముంబై సైబర్ పోలీసులు గుర్తించారు. నిందితులను విచారించేందుకు కరీంనగర్‌కు వచ్చారు. ప్రైవేట్ బ్యాంక్‌లో డొల్ల కంపెనీ పేరిట ఉన్న ఖాతాలో లావాదేవీలకు సంబంధించిన సమాచారాన్ని, రికార్డులతోపాటు నిందితుడి వద్ద లభించిన కొన్ని కీలక పత్రాలను ముంబై పోలీసులు స్వాధీనం చేసుకుని వెంట తీసుకు వెళ్లినట్లు సమాచారం. సైబర్ నేరస్థులతో కరీంనగర్ వ్యక్తులకు ఏమిటి సంబంధం? వారికి పరిచయం ఏమిటి? అనేది తెలియడంలేదు. కరీంనగర్‌కు చెందిన కొందరికి ఉద్యోగం లేదా కమిషన్ పేరిట ఆశ చూపించి వారిచేత ఒక జాయింట్ అకౌంట్ తెరచి, సైబర్ నేరగాళ్ల ఫ్రాడ్ చేసిన డబ్బులను ఆ ఖతాలోకి మళ్లించిన అనంతరం డ్రా చేసుకున్నట్లు తెలిసింది. సైబర్ క్రైంతో సంబంధం ఉన్నది కాబట్టే ఒకరిని అరెస్టు చేశారని నిర్ధారణ అయింది. ఈ కేసుకు సంబంధించి ముంబై సైబర్ పోలీసులు వివరాలు చెప్పలేదని, స్థానికంగా విచారణకు సహకరించాలని కోరారని స్థానిక పోలీసు అధికారులు చెబుతున్నారు.

గ్రామ పంచాయతీల్లో పంచాయతీరాజ్ డీసీ పర్యటన


తిమ్మాపూర్‌లో సెగ్రిగేషన్ షెడ్‌ని పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ జాన్ వెస్లీ

తిమ్మాపూర్. జూలై 12: తిమ్మాపూర్ గ్రామాన్ని పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ జాన్ వెస్లీ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయితీ రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో పారిశు ధ్యం, ప్లాంటేషన్, నర్సరీ, వైకుంఠధామం, సెగ్రిగేషన్ షెడ్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. గ్రామ పంచాయతీ పనితీరు బాగుందని అభినందించారు. వివిధ జిల్లాల పంచాయితీల కార్యదర్శులకు తిమ్మాపూర్‌లో శిక్షణ ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో డీపీవో రవీందర్, డివిజనల్ పంచాయతీ అధికారి రాంబాబు, ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎంపీవో కిరణ్ కుమార్, పంచాయితీ కార్యదర్శి కె మహేందర్ రావు, గ్రామ పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

● జమ్మికుంట రూరల్: మండలంలోని గండ్రపల్లి గ్రామపంచాయతీని పంచాయతీ రాజ్ డిప్యూటీ కమీషనర్ జాన్ వేస్లీ శుక్రవారం సందర్శించారు. గ్రామంలోని నర్సరీ, వైకుంఠదామం, పల్లె ప్రగతి, డంపింగ్‌యార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో కరీంనగర్, హుజూరాబాద్ డీఎల్పీవోలు శ్రీనివాస్, రాంబాబు, ఎంపీడీవో భీమేష్, ఎంపీవో సతీష్ కుమార్, ఏపీవో లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి ఝాన్సీరాణి పాల్గొన్నారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలి

సైదాపూర్, జూలై 12: మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు పిట్ట రవీందర్, ఉపాధ్యక్షుడు పెసరు కుమార స్వామి మత్స్యశాఖ కమిషనర్ ప్రియాంక అలా, మత్స్య పారిశ్రామిక సంఘం రాష్ట్ర చైర్మన్ మెట్టు సాయికుమార్‌ను కోరారు. వారు హైదరాబాద్‌లో అధికారులను శుక్రవారం కలిశారు. కరీంనగర్ జిల్లాలోని 26 సంఘాల పరిధిలో సభ్యత్వ నమోదుకు స్కిల్ టెస్ట్ పూర్తి చేసుకుని ప్రొజిలింగ్ కోసం ఎదురు చూస్తున్నారన్నారు. వారికి త్వరగా ప్రొజిలింగ్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ముదిరాజ్ నాయకులు పాల్గొన్నారు.

సోలార్ స్మార్ట్ క్లాస్‌లపై శిక్షణ తరగతుల ముగింపు

కరీంనగర్ టౌన్, జూలై 12: కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రభుత్వ ఉపాధ్యాయులకు సైన్స్ పరికరాలు, సోలార్ స్మార్ట్ క్లాస్‌లపై నగరంలోని ఫిల్మ్‌భవన్‌లో శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి సీహెచ్ వీఎస్ జనార్దన్‌రావు మాట్లాడుతూ యునిసెఫ్ సంస్థ సమగ్రశిక్ష తెలంగాణ సంయుక్త ఆధ్వర్యంలో హిందూస్తాన్ పెట్రోలియం సహకారంతో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని 125 పాఠశాలలకు అందించిన సైన్స్ పరికరాలతో శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ఉపాధ్యాయులు శిక్షణ కార్యక్రమాల్లో నేర్చుకున్న అంశాలను తరగతి గదుల్లో విద్యార్థులకు ప్రయోగాత్మకంగా బోధించాలన్నారు. కరీంనగర్, సిద్దిపేట, హన్మకొండ జిల్లాలకు చెరందిన 23 పాఠశాలల సైన్స్ ఉపాధ్యా యులకు సోలార్ ప్రాజెక్టర్ నిర్వహణ, సైన్స్ పరికరాల వినియోగంపై శిక్షణ తరగతులు ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 15న సోమవారం కరీంనగర్‌లోని ధన్గరివాడీ పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్‌పై కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం ఉంటుందని, అందరూ హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో యూనిసెఫ్ సంస్థ మానిటరింగ్ డైరెక్టర్ కె గిరిజాశంకర్, రిసోర్స్ పర్సన్ రాజు, ప్రాజెక్టు ఇంజనీర్ వికాస్, డిల్లీ సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ అభిషేక్ దిక్షిత్ కాన్పూర్ జిల్లా సైన్స్ అధికారి జైపాల్‌రెడ్డి, ప్లానింగ్ కో-ఆర్డినేటర్ అబ్దుల్ బారీ, కె అశోక్‌రెడ్డి, ఏఎంవో అంజనేయులు, సీఎంవో ఎ శ్రీనివాస్, భాస్కర్, తొర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సల్లంగ చూడు పోచమ్మ తల్లి


నెత్తిన బోనంతో ఊరేగింపులో పాల్గొన్న చైర్ పర్సన్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల టౌన్, జూలై 12: ఊరు వాడా సల్లంగ చూడు పోచమ్మ తల్లి అంటూ జగిత్యాల జిల్లా కేంద్రంలోని తులసీనగర్, అన్నపూర్ణ చౌరస్తాలో ఉన్న గంగపుత్ర సంఘం వార్డుల్లోని భక్తుల ఆధ్వర్యంలో శుక్రవారం పోచమ్మ తల్లికి బోనాల పండుగ కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఇంటికో బోనం నెత్తిన ఎత్తుకుని ఊరేగింపు నిర్వహించారు. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి కార్యక్రమంలో పాల్గొని నెత్తిన బోనం ఎత్తుకుని మహిళలకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం డీజే పాటలు, కోలాటాల మధ్య పోచమ్మ తల్లి ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సిరికొండ పద్మ సింగారావు, తొపారపు లావణ్య రజనీకాంత్ పాల్గొన్నారు.

హుజూరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్

హుజూరాబాద్, జూలై 12: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్య శాస్త్ర విభాగాధిపతిగా పని చేస్తున్న లక్ష్మీనర్సింహమూర్తి శుక్రవారం డాక్టరేట్ అందుకున్నారు. లక్ష్మీనర్సింహామూర్తి చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలో 'కస్టమర్ పర్‌సెప్షన్ టు వర్డ్స్ డిజిటల్ బ్యాంకింగ్ ఏ సెలక్ట్ స్టడీ' అనే అంశంపై పరిశోధన చేయగా, డాక్టరేట్ పొందారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపక బృందం లక్ష్మీనర్సింహామూర్తిని సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఇందిరాదేవి, అధ్యాపకులు దినకర్, శ్రీనివాస్, మధు, పరమేష్, శ్యామలదేవి, హరిప్రసాద్, సమ్మయ్య, స్వరూప, స్వప్న, రాజ్‌కుమార్, రమేష్, శ్రీలత, స్పందన, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పోస్ట్‌మార్టం గది



జమ్మికుంట ఆసుపత్రిలో శిథిలావస్థకు చేరుకున్న పోస్టుమార్టం గది, కొత్తగా కేటాయించిన స్టోర్ రూం చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు

జమ్మికుంట, జూలై 12: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం గది పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. 1988లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దగ్గుపాటి వెంకటేశ్వర్‌రావు ప్రభుత్వ ఆస్పత్రిని ప్రారంభించారు. పాత భవనం నిర్మించి 35సంవత్సరాలు గడవడంతో పూర్తిగా శిథిలవస్థకు చేరుకుంది. 2018లో ఆసుపత్రికి కొత్త భవనం నిర్మించి ప్రారంభించారు. భవణం కోసం కోట్లాది రూపాయాలు వెచ్చించిన ప్రభుత్వం పోస్ట్‌మార్టం గది కోసం పది లక్షలు మంజూరు చేయలేక పోవడంపై పలువురు అప్పటి మంత్రి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. నూతన ఆసుపత్రి భవన నిర్మాణం పూర్తయి ఏడేళ్లు గడుస్తున్నా పోస్టుమార్టం నూతన గది నిర్మాణం కోసం నిధులు మంజూరు కాక పోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

● స్టోర్‌రూం కేటాయించినా..

ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఉన్న పోస్ట్‌మార్టం గది శిథిలావస్థకు చేరుకోవడంతో పాడుబడిన స్టోర్‌రూమ్‌ను తాత్కాలికంగా కేటాయించారు. స్టోర్‌రూమ్ కొత్తగా కనపడేందుకు ముందు బాగంలో మాత్రమే పెయింటింగ్ వేయించారు. చుట్టూ, వెనుక భాగం చెట్టు, గడ్డి మొక్కలతో నిండిపోయింది.

నాటు సారా పట్టివేత

గన్నేరువరం, జూలై 12: ఎక్సైజ్ సూపరిండెంట్ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు మండలంలోని గుండ్లపల్లి, గునుకుల కొండాపూర్, జంగపల్లి గ్రామాల్లో శుక్రవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఏడు లీటర్ల నాటు సారాను పట్టుకుని స్వాధీనం చేసుకు న్నారు. మోత్కులపల్లిలో నాటు సారాను తయారుచేసిన సం పంగి కొమురయ్య, ఇరుగదిండ్ల పావయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఎస్ బాబా తెలిపారు. నాటుసారా తయారు చేసినా, అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ శ్రీకాంత్, సిబ్బంది నరేష్, కొండల్‌రెడ్డి, మనోహర్, రజిత, వంశీ పాల్గొన్నారు.

బైండోవర్ అతిక్రమణకు రూ.30 వేల జరిమానా

జమ్మికుంట, జూలై 12: జమ్మికుంట మండలం వావిలాలకు చెందిన దుస్స కొమురయ్య అనే వ్యక్తి గతంలో నాటు సారా విక్రయాలు జరుపగా ఎక్సైజ్ పోలీస్‌లు అదుపులోకి తీసుకోని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. బైండోవర్ తర్వాత నిబంధనలను అతిక్రమించి తిరిగి నాటుసారా అమ్మడంతో అతడిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ ఎస్ఐ సౌమ్య తహసీల్దార్ విజయ ఎదుట హాజరు పరిచారు. బైండోవర్ అతిక్రమించిన కొమురయ్యకు తహసీల్దార్ 30 వేల రూపాయల జరిమానా విధించారు.

అంజన్న హుండీ ఆదాయం రూ.65.39 లక్షలు



కొండగట్టు, ఇల్లందకుంట ఆలయాల ఆవరణలో హుండీ లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

మల్యాల, జూలై 12: కొండగట్టు అంజనేయస్వామి దేవస్థానానికి హుండీల ద్వారా 65,39,167 రూపాయల ఆదాయం సమకూరినట్లు ఈవో ఎ చంద్రశేఖర్ తెలిపారు. 35 రోజులకు గాను ఆలయంలోని 12 అంజన్న హుండీలను విప్పి శుక్రవారం లెక్కించారు. నగదుతోపాటు 30 గ్రాముల మిశ్రమ బంగారం, 1.85 కిలోల మిశ్రమ వెండి, 38 విదేశీ కరెన్సీ నోట్లు లభించినట్లు ఈవో తెలిపారు. ఈ లెక్కింపులో వరంగల్ ఏసీ కార్యలయం పరిశీలకులు కవిత, ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, చంద్రశేఖర్ శ్రీ లలిత సేవా ట్రస్ట్ సభ్యులు లెక్కింపులో పాల్గొన్నారు.

● ఇల్లందకుంట ఆలయ ఆదాయం రూ. 7.23 లక్షలు

ఇల్లందకుంట: ఇల్లందకుంట మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో శుక్రవారం హుండీలను ఆలయ కార్యనిర్వాహణాధికారి కందుల సుధాకర్ ఆధ్వర్యంలో లెక్కించారు.

ఈ మేరకు 70 రోజుల్లో సమకూరిన హుండీల ద్వారా 7,23,433 రూపాయలు సమకూరింది. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్లు కావటి మోహన్, రాజయ్య, మల్లారెడ్డి, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీకి తగ్గిన ఇన్‌ఫ్లో

జగిత్యాల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో తగ్గింది. శుక్రవారం ఎస్సారెస్పీలోకి 479 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 90.323 టీఎంసీలు కాగా ప్రస్తుతం 12.44 టీఎంసీల నీరు ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 17.453 టీఎంసీల నీరు ఉంది. ప్రా జెక్టు నుంచి 479 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 6.615 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

చికెన్ సెంటర్‌లో అగ్నిప్రమాదం

కరీంనగర్ క్రైం, జూలై 12: కరీంనగర్ మారుతీనగర్ చౌరస్తాలో భారత్ చికెన్ సెంటర్‌లో శుక్రవారం ఉదయం అగ్నిప్రమాదం జరిగింది. షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు అంటుకుని షాపులోని టీవీ, సీసీ కెమెరాలు, విద్యుత్ మీటర్, కౌంటర్, వేయింగ్‌మిషన్ కాలిపోయాయయని చికెన్ సెంటర్ యజమాని ఎండీ ఇస్మాయిల్ తెలిపారు. దాదాపు లక్ష రూపాయల వరకు నష్టం జరిగిందన్నాడు. సంఘటనా స్థలాన్ని ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ సందర్శించారు. బాధితుడికి ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందించి ఆదుకోవాలని కోరారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

మెట్‌పల్లి రూరల్, జూలై 12: మండలంలోని వేంపేట శివారులోని వ్యవసాయ క్షేత్రంలో పేకాట స్థావరంపై ఎస్ఐ చిరంజీవి సిబ్బందితో కలిసి దాడి చేశారు. శుక్రవారం గ్రామ శివారులో ఎనిమిది మంది పేకాట ఆడుతున్నరనే సమాచారం మేరకు మఫ్టీలో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ తెలిపారు. ఐదుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 14,200 రూపాయలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

మల్యాల, జూలై 12: మండలంలోని రామన్నపేటలో ఉమ్మడి రవి అనే వ్యక్తి ఇంట్లో దొంగతనం జరిగింది. రవి కుటుంబసభ్యులు తమ ఇంటికి తాళం వేసి సమీపంలోని సంఘ భవనంలో ఉంటున్నారు. శుక్రవారం తెల్లవారు జామున తాళం వేసి ఉన్న ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లో బీరువా తెరిచి వెండి నగలు, ఇతర వస్తువులను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై నరేష్, పోలీసులు సంఘటన స్థలం పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నాడు.

● మెట్‌పల్లి: పట్టణంలో మనోహర్ గార్డెన్ సమీపంలోని తాళం వేసిన ఓ ఇంట్లో శుక్రవారం చోరీ జరిగింది. పట్టణానికి చెందిన లక్కం పద్మ ఉదయం ఇంటికి తాళం వేసి బంధువులను కలవడానికి మరోగ్రామానికి వెళ్లింది. సాయంత్రం ఇంటికి వచ్చి చూసే సరికి ఇంటి తాళం పగలగొట్టి ఉంది. అనుమానం వచ్చి లోపలికి వెళ్లి చూసేసరికి ఇంట్లో దాచిన ఆరు తులాల బంగారు అభరణాలు, ఐదు వేల నగదు చోరీ జరిగినట్లు గుర్తించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించింది. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

కుమారుడి మృతిపై
అనుమానాలున్నాయని డీజీపీకి ఫిర్యాదు

చొప్పదండి, జూలై 12: తమ కుమారుడు మంద విను మృతిపై అనుమానాలు ఉన్నాయని చొప్పదండికి చెందిన మంద మహేందర్, నీరజ డీజీపీ ఫిర్యాదు చేశారు జనవరి 21న ములుగు జిల్లా మేడారం గ్రామానికి మంద విను మరో ముగ్గురితో కలసి వెళ్లాడు. 22న విను మృతిచెందాడని తమ కు సమాచారాన్ని అందిందన్నారు. విను మృతిపై అనుమా నాలు ఉన్నాయని తాడ్వాయి పోలీసులకు చెప్పినా పట్టించు కోలేదని, తమకు న్యాయం చేయాలని డీజీపీని కోరారు.

ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొని యువకుడి మృతి

పెద్దపల్లి రూరల్, జూలై 12: మండలంలోని రాఘవపూర్ గ్రామానికి చెందిన రమేష్ (29) ద్విచక్ర వాహనంపై వెళుతూ ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రమేష్ శుక్రవారం కిరాణ దుకాణానికి ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డుపై నిలిచి ఉన్న వాహనాన్ని ఢీకొంది. రమేష్ తండ్రి తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి తెలిపారు.

వరినాటు యంత్రం బోల్తా: డ్రైవర్‌కు గాయాలు

శంకరపట్నం, జూలై 12: మండలంలోని కన్నాపూర్ శివారులో శుక్రవారం వరినాటు యంత్రం బోల్తా పడి డ్రైవర్ కు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కన్నాపూర్ శివారులో చెరువు కట్టపై నుంచి వరినాటు యంత్రం వెళుతుండగా అదుపుతప్పి కట్ట కింద బోల్తా పడింది. మిషన్ కింద డ్రైవర్ పడి కేకలు వేయడంతో సమీపంలోని ప్రజలు అక్కడికి చేరుకొని వరినాటు మిషన్ పైకి లేపి డ్రైవర్‌ను బయటకు తీశారు. గాయాలైన డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ తమిళనాడుకు చెందిన వ్యక్తి కావడంతో అతడి వివరాలు తెలియరాలేదు.

మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

జమ్మికుంట రూరల్, జూలై 12: వీణవంక మండలం పోతిరెడ్డిపల్లి సమీపంలోని మానేరు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామంలో శుక్రవారం పోలీస్‌లు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక తర టలిస్తున్న ప్రశాంత్, శ్రీకాంత్, పరుశురామ్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

రూ. 7,550 పలికిన పత్తి ధర

జమ్మికుంట, జూలై 12: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7550 రూపాయలు పలికింది. శుక్రవారం మార్కెట్ యార్డుకు 193 క్వింటాళ్ల విడి పత్తి వచ్చింది. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర 7,550, కనిష్ఠ ధర 7,200 రూపాయలు చెల్లించి పత్తి కొన్నారు.

అధ్వానంగా ఆరెపల్లి-రేకుర్తి రోడ్డు

ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



అధ్వానంగా ఉన్న ఆరెపల్లి-రేకుర్తి రోడ్డు

భగత్‌నగర్, జూలై 12: నగరంలోని ఆరెపల్లి-రేకుర్తి గ్రామాలను కలుపుతున్న రోడ్డు ప్రమాదకరంగా మారడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కరీంనగర్‌లోని 1, 2, 20, 18 డివజన్లలో ఉన్న ఆరెపల్లి-రేకుర్తి రోడ్డు అధ్వానంగా మారడంతో వాహనదారులు ఈ రోడ్డుపై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆరెపల్లి మీదుగా రాయపట్నం-కరీంనగర్ రహదారి మీదుగా వెళ్లే వాహనాలు జగిత్యాలకు వెళ్లాలంటే ఆరెపల్లి-రేకుర్తి రోడ్డునే వాహనదారులు ఆశ్రయిస్తూ ఉంటారు. ఆరెపల్లి, సీతారాంపూర్, తీగలగుట్టపల్లి, రేకుర్తి గ్రామాలు నగరపాలక సంస్థలో విలీనమైన ఈ రోడ్డు పరిస్థితి మారకపోవడంతో రాకపోకలు నరక ప్రాయంగా మారిపోయింది. కరీంనగర్-రాయపట్నం రాష్ట్ర రహదారిని కరీంనగర్-జగిత్యాల రహదారిని కలపడానికి ముఖ్య రోడ్డుగా ఉన్న ఆరెపల్లి-రేకుర్తి రోడ్డు అధ్వాన్నంగా ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం వేళలో వివిధ పాఠశాలలకు చెందిన బస్సులు సైతం ఈ రోడ్డుపై నుంచి వెళ్తుండడంతో ప్రమాదాలకు నెలవుగా మారిపోయింది. కొత్తపల్లిలో పలు ప్రముఖ పాఠశాలలు ఉండడంతో నిత్యం వందలాదిగా వాహనాలు ఈ రోడ్డుపై రాకపోకలు సాగిస్తు ఉన్నాయి. తీగలగుట్టపల్లి నుంచి ఆరెపల్లి మీదుగా రేకుర్తి చేరుకునేందుకు నిత్యం వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

● వర్షాకాలంలో నానా అవస్థలు..

వర్షాకాలం వచ్చిందంటే చాలు ఆరెపల్లి-రేకుర్తి రోడ్డుపై వెళ్లాలంటే నిత్యం వాహనదారులు ఇబ్బందుల పడుతున్నారు. కాలం చెల్లిన రోడ్డుపై వర్షానికి వరదనీరు చేరడంతో గుంతలు ఎక్కడ ఉన్నాయో తెలియక వాహనదారులు నానా పాట్లు పడుతున్నారు. వర్షాలకు రోడ్డు మొత్తం చెడిపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆరెపల్లి-రేకుర్తి రోడ్డును తాత్కాలిక మరమ్మతులు సైతం చేయించక పోవడంతో రోడ్డు పూర్తిగా చెడిపోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కరీంనగర్‌లో తీగలగుట్టపల్లి వద్ద ఉన్న రైల్వే గేటును తప్పించుకునేందుకు సులువైన మార్గంగా ఉన్న ఆరెపల్లి-రేకుర్తి రోడ్డుపై నిత్యం వందలాదిగా వాహనాలు వెళ్తుంటాయి. ద్విచక్ర వాహనాలతో పాటు, కార్లు, పాఠశాలల బస్సులు నిత్యం వెళ్తుండడంతో పూర్తిగా చెడిపోయిన రోడ్డులో నానా పాట్లు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ఆరెపల్లి-రేకుర్తి రోడ్డును పునర్మించాలని నగర వాసులు కోరుతున్నారు.

అకారణంగా సస్పెండ్ చేయడం బాధాకరం

కరీంనగర్ కల్చరల్, జూలై 12: దక్షిణ ఇండియా క్రైస్తవ సంఘం-అధ్యక్ష మండల పీఠంలో (ఉమ్మడి వరంగల్, కరీంనగర్, నల్గొండ జిల్లాల పరిధి) ఉన్న చర్చిలలో డైసీన్ కౌన్సిల్‌లో 2022-2025 సంవత్సరాలకు గాను ఎన్నికైన తమను అకారణంగా సస్పెండ్ చేయడం బాధాకరమని కార్యదర్శి జె సామ్యూల్, కోశాధికారి కెవి కెనడి అన్నారు. గురువారం కరీంనగర్ బిషప్ కార్యాలయంలో పునర్నియామక ఉత్తర్వులను అందించేందుకు వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము ఏ తప్పూ చేయలేదని, ఎలాంటి ఆరోపణలు లేకున్నా అకారణంగా సస్పెండ్ చేయడం బాధాకరమని అన్నారు. మద్రాసు కోర్టును ఆశ్రయించగా ఎగ్జిక్యూటివ్ తీసుకున్న నిర్ణయాన్ని తప్పుపడుతూ పదవులను, ప్రాథమిక సభ్యత్వాన్ని పునరుద్ధరించాలని ఆదేశించిందన్నారు. కోర్టు ఆర్డర్‌తో బిషప్ కార్యాలయానికి వచ్చామన్నారు. బిషప్ డాక్టర్ కె రూబెన్‌మార్క్ అమెరికాలో ఉండటంతో కార్యాలయ ఇన్‌చార్జిలకు కోర్టు పత్రాలు సమర్పించేందుకు ప్రయత్నించగా ఎవరూ స్వీకరించేందుకు ముందుకు రాలేదని అన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

కరీంనగర్ రూరల్, జూలై 12: పర్యావరణాన్ని పరిరక్షించడంలో ప్రతి ఒక్కరూ బాగస్వాములు కావాలని రెవెన్యూ డివిజనల్ అధికారి కుందారపు మహేశ్వర్ సూచించారు. శుక్రవారం కరీంనగర్ మండలం చేగుర్తిలో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెనాల్ ప్రాంతాల్లో మొక్కలు నాటడంతో ఎస్సారెస్పీ కాలువలు కబ్జాకు గురికాకుండా ఉంటాయని ప్రతీ గ్రామంలో ఇలానే మొక్కలు నాటాలని ఉపాధిహామీ అధికారులకు, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంజీవరావు, ఏపీఓ శోభరాణి, ఐకేపీ ఏపీఎం భార్గవ్, గ్రామాల కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

- జమ్మికుంట రూరల్ సీఐ కిశోర్

ఇల్లందకుంట, జూలై 12: ప్రతీ వాహనదారుడు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని జమ్మికుంట రూరల్ సీఐ కోరె కిశోర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద పలు వాహనాలను తనిఖీ చేశారు. బండికి నంబర్ ప్లేట్ లేకుండా ఉండే వాహనాలు, ట్రాఫిక్ రూల్స్, ట్యాంపరింగ్ నంబర్ గల వాహనదారులకు పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా నంబర్ కనపడేటట్లు వాహనానికి ఉండాలన్నారు. ట్రాఫిక్ రూల్స్, నంబర్ ప్లేట్లు లేని వాహనాలు కనపడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజకుమార్, సిబ్బంది అశోక్, పరుశరామ్, రవి పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

కరీంనగర్ రూరల్, జూలై 12: మహిళలు బాగుంటేనే ఇల్లు బాగుటుందని, మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని ఆర్డీవో మహేశ్వర్ అన్నారు. శుక్రవారం కరీంనగర్ మండలం దుర్శేడ్‌లో నిర్వహించిన శుక్రవారం సభకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహిళల సమస్యల పరిష్కారానికే అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా శుక్రవార సభకు శ్రీకారం చుట్టారని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల, ఎంపీడీవో సంజీవరావు, ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, ఏఎన్ఎమ్ పద్మ, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని వంకాయగూడెంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని మండల ప్రత్యేకాధికారి నాగార్జున సందర్శించి చిన్నారులు బాలింతలు, గర్భిణులతో సమావేశమయ్యారు. అంగన్‌వాడీలకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు పిల్లలు, మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీవాణి, సీడీపీవో సబిత, ఎంపీవో బషీరుద్దీన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్రవంతి పాల్గొన్నారు.

వీణవంక: మండలంలోని చల్లూరు అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ డి కొమురయ్య, ఎంపీడీవో శ్రీధర్, ఎంపీవో ప్రభాకర్ పాల్గొన్నారు.

తిమ్మాపూర్: మండలంలోని అన్ని గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో మహిళా, శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సభలు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. తిమ్మాపూర్ మండల ప్రత్యేకధికారి డీపీవో రవీందర్ మండలంలోని రేణికుంటలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో జరిగిన కార్యక్రమానికి హాజరై తల్లులకు, గర్భిణులకు అవగాహన కల్పించారు. ఎంపీడీవో విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

చొప్పదండి: మండలంలోని ఆర్నకొండలోని అంగన్‌వాడి కేంద్రాన్ని మండల ప్రత్యేక అధికారి జయశంకర్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పోషకాహార ప్రాముఖ్యత గురించి వివరించారు. ఎంపీవో రాజగోపాల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, పాల్గొన్నారు.

రామడుగు: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మహిళా సమస్యలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి అనిల్ ప్రకాష్‌కిరణ్ హాజరై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుధారాణి ఉన్నారు.

జగన్నాథుని రథయాత్రను విజయవంతం చేయాలి



సైకత శిల్పాలను తిలకిస్తున్న కలెక్టర్, తదితరులు

కరీంనగర్ కల్చరల్, జూలై 12: ఈ నెల 15న కరీంనగర్ ఇస్కాన్ దేవాలయం, జగన్నాథ రథయాత్ర కమిటీ, ప్రజ్ఞాభారతి ఆధ్వర్యంలో నిర్వహించే జగన్నాథ రథయాత్రను విజయవంతం చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి పిలుపునిచ్చారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ద్వారం ఎదుట అంతర్జాతీయ సైకత శిల్పి రేవెల్లి శంకర్ రూపొందించిన బలభద్ర, సుభద్రా సమేత జగన్నాథ స్వామి సైకత శిల్పావిష్కరణకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పూజలు నిర్వహించి సైకత శిల్పాలను ఆవిష్కరించారు. శిల్పి శంకర్‌ను అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ నెల 15న కరీంనగర్‌లో జరిగే రథయాత్రలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని తరించాలని పిలుపునిచ్చారు. జగన్నాథుని బోధనలను అనుసరిస్తూ ప్రజలంతా సన్మార్గంలో పయనించాలని అన్నారు. కలెక్టర్ ఒరిస్సా రాష్ట్రానికి చెందిన వ్యక్తి కావడంతో పూరీ జగన్నాథ రథయాత్ర వివరాలను విషదీకరిస్తూ భక్తి భావోద్వేగానికి లోనయ్యారు. కార్యక్రమంలో రథయాత్ర నిర్వాహకుడు నరహరి, కార్పొరేటర్ రవీందర్‌సింగ్, రథయాత్ర కమిటీ చైర్మన్ కన్న కృష్ణ, కో చైర్మన్‌లు తుమ్మల రమేశ్‌రెడ్డి, కోమాళ్ళ రాజేందర్‌రెడ్డి, డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి, కోశాధికారి జె సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

'హరితహారం' కొనసాగించడం అభినందనీయం: ఎమ్మెల్యే



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

జమ్మికుంట రూరల్, జూలై 12: ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని కొనసాగించడం అభినందనీయమని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బిజిగిరిషరీఫ్‌లో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడలేని విధంగా హరితహారం కార్యక్రమం ప్రారంభించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దక్కిందన్నారు. రాజకీయాలతో సంబంధం లేకుండా హరితహారం కార్యక్రమం యథావిధిగా కొనసాగించడంపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తహసీలార్ విజయ, ఎంపీడీవో భీమేష్, ఎంపీవో సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

ఇల్లందకుంట: మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో వన మహోత్సవంలో భాగంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అధికారులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వీణవంక: మండలంలోని చల్లూరులో వన మహోత్సవంలో భాగంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మె ల్యే మాట్లాడుతూ తెలంగాణలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హరితహారం పేరిట తెలంగాణను పచ్చదనంగా మార్చరని కాంగ్రెస్ ప్రభుత్వం మొక్కటు నాటే కార్యక్రమన్ని ముందుకు తీసుకెళ్లడం అభినందనీయం అని అన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని కాపాడలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ మాజీ చైర్మన్ వాల బాలకిషన్ రావు, ముసీపట్ల తిరుపతి రెడ్డి, పొదిల రమేష్, మల్లయ్య, ఎంపీడీవో, ఎంపీవో, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కరాటే పోటీలు నిర్వహించడం అభినందనీయం



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న బండి సంజయ్

కరీంనగర్ స్పోర్ట్స్, జూలై12: జిల్లా కేంద్రంలో జాతీయ కరాటే పోటీలు నిర్వహించడం అభినందనీయమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఆగష్టు 4వ తేదీన జిల్లా కేంద్రంలోని రాజశ్రీ గార్డెన్‌లో నిర్వహించనున్న గౌరు నారాయణరెడ్డి మెమోరియల్ జాతీయ కరాటే పోటీల్లో బ్రోచర్‌ను ఆయన శుక్రవారం హైదరాబాద్‌లో ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో పోటీల నిర్వహకులు గౌరు రాజిరెడ్డి, సీనియర్ కరాటే మాస్టర్ వసంత్‌కుమార్, రాష్ట్ర కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు ఈ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు మాడుగుల ప్రవీణ్, కార్పోరేటర్ రాపర్తి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

జమ్మికుంట, జూలై 12: సైబర్ నేరాలపై యువత తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు. శుక్రవారం జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ఆబాది జమ్మికుంటలో యువతకు సీఐ అవగాహన కల్పించారు. ఈ సంధ్బంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దన్నారు. ఫోన్‌లలో ఓటీపీ, పేటీఎం, గూగుల్ పే, ఫోన్ పే, కేవైసీలను అప్‌డేట్ చేయాలని వచ్చే మెసేజ్‌లకు స్పందించవద్దన్నారు. సైబర్ నేరాలబారిన పడినప్పుడు టోల్‌ఫ్రీ నంబర్‌కు డయల్ చేసి తెలపాలని సూచించారు.

పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహించవద్దు

గంగాధర, జూలై 12: పారిశుధ్య నిర్వహణపై నిర్లక్ష్యం తగదని మండల పరిషత్ ప్రత్యేకాధికారి, జడ్పీ సీఈవో శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం గంగాధర ఎంపీడీవో కార్యాలయంలో ఆశా కార్యకర్తలు, కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రోడ్లపై చెత్త వేస్తే జరిమానా విధించాలని, కాలనీల్లో మురగు నీరుండకుండా చూడాలని సూచించారు. సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా చర్యలు తీసుకొవాలని, తాగు నీటి సరఫరా, పారిశుధ్యం మెరుగు పరచేందుకు కార్యదర్శులు గ్రామాల్లో ప్రత్యేక చర్యలు తీసుకొవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాము, తహసీల్దార్ రమేష్‌బాబు, ఎంపీవో జనార్దన్‌రెడ్డి, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధి కోసమే సహకార సంఘాలు

- మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



కారులో పెట్రోల్ కొడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

శంకరపట్నం, జూలై 12: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు రైతుల అభివృద్ధి కోసం పని చేస్తున్నాయని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం శంకరపట్నం మండలంలోని గద్దపాక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ పంపును కేడీసీసీ బ్యాంకు చైర్మన్ కొండూరు రవీందర్‌రావుతో కలిసి ఎమ్మెల్యే సత్యనారాయణ పునఃప్రారంభించారు. అనంతరం సొసైటీ ఆవరణలో రైతులతో ఏర్పడిన సమావేశంలో వారిని ఉద్దేశించి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఆర్థిక సంస్కరణలు చేపట్టి బ్యాంకుల జాతీయకరణ చేశారన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సహకార సంఘాల పునరాభివృద్ధికి దోహదపడిన విషయాన్ని గుర్తు చేశారు. సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ పంపు మళ్లీ పునఃప్రారంభించడం రైతులకు శుభపరిమాణమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సహకార సంఘాల అభివృద్ధికి సహకరిస్తుందన్నారు. రూ. 2లక్షల పంట రుణాల రుణమాఫీ ఆగస్టు లోపు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గద్దపాక సొసైటీ చైర్మన్ గుర్రాల తిరుపతిరెడ్డి, జిల్లా సహకార ఆడిట్ అధికారి శ్రీనివాస్, చైర్మన్లు మధుకర్‌రెడ్డి, సంజీవరెడ్డి, మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గోపగోని బసవయ్య, సహకారసంఘాల డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న పక్షుల మైత్రి



ఆహారం పంచుకుంటున్న పక్షులు, అక్కున చేర్చుకుంటున్న లవ్‌బర్డ్

నగరంలోని బిషప్ కార్యాలయ ఆవరణలో లవ్‌బర్డ్స్ చూపరులను కనువిందు చేస్తున్నాయి. వాటి సోయగాన్ని 'ఆంధ్రజ్యోతి' కెమెరాలో బంధించింది. పక్షుల మధ్య ప్రేమ, స్వేచ్ఛ, హావభావాలను పలువురు చూస్తూ ముచ్చటించుకున్నారు.

- 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, జూలై 12: నగరంలో సబ్‌స్టేషన్ నెలవారీ నిర్వహణ, చెట్ల కొమ్మలు తొలగింపు, కొత్త లైన్ పని, కొత్త స్తంభాల ఏర్పాటు, వివిధ నిర్వహణ పనుల్లో భాగంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ వన్, టు, ఏడీఈలు సాయినేని నరేందర్, సుధీర్ కుమారు ఒక ప్రటనలో తెలిపారు. విద్యుత్ సరాఫరా నిలిపివేయు సబ్‌స్టేషన్లు.. ప్రాంతాలు.. వావిలాలపల్లి, బ్యాంక్ కాలనీ, అంబేధ్కర్‌నగర్, వాటర్‌వర్క్స్ (హౌసింగ్ బోర్డ్) సబ్‌స్టేషన్‌లు, వావిలాలపల్లి, సివిల్ హాస్పిటల్, క్రిస్టియన్ కాలనీ, జ్యోతి నగర్, వేంకటేశ్వర దేవాలయం, బ్యాంక్‌కాలనీ, మెహర్‌నగర్, వరలక్ష్మినగర్, జగిత్యాల్ రోడ్, కోర్ట్ రోడ్, చైతన్యపూరి, విద్యానగర్, మంచిర్యాల్ ఎక్స్ రోడ్, సుభాష్‌నగర్, కిసాన్‌నగర్, గాంధీ రోడ్డు, తీగలగుట్టపల్లి, కాపువాడ, హౌసింగ్ బోర్డు, వెంకటసా యి, కమాన్ ఏరియా, సదాశివపల్లి, నమ భగత్‌నగర్ సబ్‌స్టేషన్, విగ్నేశ్వర కాలనీ, వెంకటేశ్వర కాలనీ, ఎన్‌జీఓస్ కాలనీ, ఎర్రగుట్టపల్లి, కట్టరాంపూర్ ఏరి యా, అంబేద్కర్ స్టేడియం, కలెక్టర్ కాంప్లెక్స్ ఏరియా, బస్టాండ్ ఏరియా, వన్ టౌన్ పోలీస్‌స్టేషన్, ఎల్ఐసీ ఆఫీస్ ఏరియా, తిర్మలానగర్, గణేష్‌నగర్, హనుమాన్ నగర్, ధోబీ వాడ, కమాన్ ప్రాంతం, సబ్ స్టేషనలు భగత్‌నగర్, ఉజ్వలపార్క్, సప్తగిరి కాలనీ, పద్మనగర్, ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రాంతాల్లో విద్యు త్‌సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలో శనివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు టౌన్ ఏఈ శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హుజూరాబాద్ పట్టణంతో పాటు బోర్నపల్లి, కొత్తపల్లిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

శంకరపట్నం: మండలంలోని తాడికల్, కన్నాపూర్, ఆముదాలపల్లి, కాచాపూర్ సబ్ స్టేషన్లలో మరమ్మత్తుల నిమిత్తం శనివారం ఆయా సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ కుమారస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడికల్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, కన్నాపూర్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు, ఆముదాలపల్లి, కాచాపూర్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

సైదాపూర్: మండలంలోని సబ్‌స్టేషన్ల మరమ్మతుల దృష్ట్యా సైదాపూర్, ఆకునూర్ సబ్‌స్టేషన్ల పరిధిలో మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని ఏఈ ఆంజనేయులు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

ఇల్లందకుంట: మండలంలోని బూజునూర్, సిరిసేడు, మల్యాల, కనగర్తి గ్రామాల్లోని సబ్‌స్టేషన్లలో శనివారం మరమ్మతులు చేపట్టనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆరు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆదర్శ ఆస్పత్రి చైర్మన్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే



సదాశివరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

శంకరపట్నం, జూలై 12: కరీంనగర్ ఆదర్శ ఆస్పత్రి చైర్మన్ కరివేద సత్యనారాయణరెడ్డిని మండలంలోని చింతగుట్ట గ్రామంలో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ శుక్రవారం పరామర్శించారు. సత్యనారాయరెడ్డి తండ్రి సదాశివరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా సదాశివరెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొని మనోధైర్యం కల్పించారు. కార్యక్రమంలో టీపీసీసీ మెంబర్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ తదితరులున్నారు.

25న కామధేనువు సూపర్‌బజార్ కార్యవర్గ సభ్యుల ఎన్నిక

కరీంనగర్, జూలై 12(ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): ఈ నెల 25వ తేదీన ది కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర వినిమయదారుల స్టోర్స్ లిమిటెడ్ కామధేనువు సూపర్ బజార్ కరీంనగర్ కార్యవర్గ సభ్యుల ఎన్నిక ఈనెల 25న నిర్వహించనున్నట్లు డిప్యూటి రిజిష్టర్, ఎన్నికల అధికారి సీహెచ్ మనోజ్‌కుమార్ తెలిపారు. కరీంనగర్‌లోని మార్కెట్ రోడ్డు వేంకటేశ్వరస్వామి దేవాలయం పక్కన ఉన్న కార్యాలయంలో ఈ నెల 25వ తేదీన ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 16వ తేదీ నుంచి 19వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. 20వ తేదీన నామినేషన్ల పరిశీలన అనంతరం నామినేషన్ల జాబితా విడుదల చేస్తామన్నారు. 21వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ, తుది జాబితా విడుదల చేసి అభ్యర్థుల ఎన్నికల చిహ్నాలను కేటాయిస్తామన్నారు. 25వ తేదీన 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సంఘం కార్యాలయంలో ఎన్నికలు జగుతాయని అనంతరం ఓట్ల లెక్కింపుచేసి ఫలితాలు ప్రకటిస్తామన్నారు.

వాగేశ్వరికి అటానమస్ హోదా

తిమ్మాపూర్, జూలై 12: స్థానిక వాగేశ్వరి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌కు యూనివర్సిటీ గ్రాండ్స్ కమిషన్(యూజీసీ) అటానమస్ హోదాను ప్రకటించిందని కళాశాల జనరల్ సెక్రటరీ జి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన కళాశాలలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. అటానమస్ హోదా పది సంవత్సరాల వరకు ఉంటుందని తెలిపారు. హోదా వల్ల ప్రస్తుతం పరిశ్రమలలో వస్తున్న మార్పులకు అనుగుణంగా, విద్యారంగంలో కావలసిన మార్పులకు అనుగుణంగా, ప్రస్తుతం బోధిస్తున్న కోర్సులలో అవసరమైన సిలబస్‌లలో మార్పులు చేసుకుంటూ, విద్యార్థులకు నూతన అంశాలను బోధించవచ్చని తెలిపారు. కళాశాలకు అటానమస్ హోదాకు కృషి చేసిన కళాశాల సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రటరీ డి శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు వినోద్, ప్రకాష్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

డాక్టర్ ఎమ్మెల్యే



క్యాంప్ కార్యాలయంలో రిపోర్టులను పరిశీలిస్తున్న కవ్వంపల్లి

తిమ్మాపూర్, జూలై 12: మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదరణ పొందిన వైద్యుడు. ప్రజాసేవ చేయడానికి రాజకీయాల్లోకి వచ్చి ఎమ్మెల్యేగా గెలుపొందాడు. కొత్తపదవి వచ్చినప్పటికీ ఆయన పాతవృత్తిని విస్మరించలేదు. ఎల్ఎండీ కాలనీలోని క్యాంప్ కార్యాలయంలో నివాసం ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉంటున్న ఆయన, తన వద్దకు వచ్చే రోగులకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారు. మెరుగైన వైద్యం పొందేందుకు సూచన లు చేస్తున్నారు. అటు వైద్యునిగా, ఇటు ప్రజాప్రతినిధిగా రెండు విధాలుగా సేవలు అందిస్తున్నారు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ.

పారమితలో పేపర్ బ్యాగ్ డే

కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 12: జిల్లా కేంద్రంలోని పారమిత పాఠశాల ఎన్‌సీసీ క్యాడెట్లు ప్రపంచ పేపర్ బ్యాగ్ డే అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పారమిత ఎన్‌సీసీ క్యాడెట్లు స్వయంగా వంద పేపర్ బ్యాగులను తయారు చేసి మంకమ్మతోట నుంచి గీతా భవన్ వరకు ర్యాలీ నిర్వహించి, కిరాణ, మందుల షాపులు, బుక్‌స్టాల్స్‌లో పేపర్ బ్యాగుల ప్రాధాన్యతను అందరికి వివరించారు. ఈ కార్యక్రమాన్ని పారమిత అధినేత డాక్టర్ ఈ ప్రసాద్‌రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు డాక్టర్ జెఎస్ పరంజ్యోతి, డాక్టర్ స్మృతి జాన్, పాఠశాల డైరెక్టర్లు ప్రసూన, రాకేశ్, రశ్మిత, అనూకర్‌రావు, వినోద్‌రావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

'అచీవర్స్'లో పాఠశాల ఎన్నికలు

గణేశ్‌నగర్, జూలై 12: కోతిరాంపూర్‌లోని అచీవర్స్ యాక్టివ్ పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ హెడ్ బాయ్, స్కూల్ హెడ్ గర్ల్ వివిధ విభాగాల్లో లీడర్లను ఎన్నుకోవడానికి శుక్రవారం ఎన్నికలు నిర్వహించారు. ఇందులో విద్యార్థులు తమ లీడర్లను ఎన్నుకోవడానికి ఎంతో ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ సీహెచ్ పల్లవి, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్లూబెల్స్‌లో గోరింటాకు సంబరాలు

కరీంనగర్ కల్చరల్, జూలై 12: నగరంలోని హనుమాన్‌నగర్ బ్లూబెల్స్ పాఠశాలలో శుక్రవారం గోరింటాకు సంబరాలను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ జంగ సునీతా మనోహర్‌రెడ్డి వేడుకల్లో పాల్గొన్నారు. ఉపాధ్యాయినులు, విద్యార్థినులు విభిన్న రూపాల్లో మైదాకును అలంకరించుకొని మురిసిపోయారు.

శ్రీ చైతన్యలో ఘనంగా ఫ్రెషర్స్ డే

తిమ్మాపూర్, జూలై 12: స్థానిక శ్రీచైతన్య ఫార్మసీ కళాశాలలో శుక్రవారం ఫిస్త పేరుతో ఫ్రెషర్స్ పార్టీ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి శ్రీచైతన్య విదా సంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ముద్దసాని లక్ష్మారెడ్డి మెమొరియల్ టాలెంట్ అవార్డులను రమేష్ రెడ్డి అందించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అకట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామనర్సింహరెడ్డి, హెచ్‌వోడి అప్పారావు, రాంప్రసాద్, రవీందర్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● సంక్షిప్త సమాచారం..

● కరీంనగర్ కల్చరల్: భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో వాగీశ్వరి డిగ్రీ కళాశాలలో శనివారం ఉదయం రచయిత వైరాగ్యం ప్రభాకర్ రచించిన రామాయణము ధర్మవచనములు-సూక్తులు పుస్తకావిష్కరణ సభ నిర్వహిస్తున్నట్లు గాయకుడు, ఉపాధ్యాయుడు కాసు మహేందర్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు.

- కరీంనగర్‌కు చెందిన కవి అన్నవరం దేవేందర్ ఆంగ్ల అనువాద కవితా సంపుటిని ఆదివారం ఉదయం 10 గంటలకు ఫిలింభవన్‌లో సాహితీ సోపతి, ఎస్పీ ఫ్రెండ్స్, కఫిసొ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు సమావేశకర్త మాడిశెట్టి గోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు.
- అనారోగ్యంతో వెంటిలేషన్‌పై చికిత్స పొందుతున్న కృష్ణ యతీంద్ర రామానుజ జీయర్‌స్వామిని శుక్రవారం కరీంనగర్‌లోని డాక్టర్ లక్ష్మీనారాయణ హాస్పిటల్‌లో పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ జీవి శ్యాంప్రసాద్‌లాల్ పరామర్శించారు.
- నగరంలోని మారుతినగర్‌లో యాస్వాడ రాకేశ్‌శర్మ ఆధ్వర్యంలో వారాహి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు.

● భగత్‌నగర్: సుడా చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన కరీంనగర్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డిని కొత్తపల్లి మండల అధ్యక్షుడు పంజాల స్వామిగౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

● సుభాష్‌నగర్: నగరంలోని ఒకటవ టౌన్ ఎదుట గల ఐలాండ్‌లో చొక్కారావు విగ్రహంతోపాటు తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎక్కడ ఉంచారో మున్సిపల్ అధికారులు సమాదానం చెప్పాలని, వాటిని యథాస్థానంలో ఏర్పాటు చేయాలని న్యాయవాది సర్దార్ మంజిత్‌సింగ్ అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్‌కి వినతిపత్రం అందచేశారు.

● గణేశ్‌నగర్: ఉద్యమకారుడు అభానాష్ వర్ధంతి సందర్భంగా స్థానిక తెలంగాణ చౌక్‌లో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులు అలర్పించారు. ఉద్యమకారులు జిఎస్ ఆనంద్, దయాల ఓం ప్రసాద్, గొడిశాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

● కరీంనగర్ రూరల్: మండలంలోని నగునూర్‌లోగల దుర్గాభవానీ ఆలయంలో ఆలయ ధర్మాధికారి, వేదపండితులు పురాణం మహేశ్వరశర్మ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆషాఢ శాకాంబరీ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారికి నిమ్మకాయల మాలలను అలంకరించారు.

● చొప్పదండి: చొప్పదండిలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు అధికారులు బదిలీపై వెళ్తున్న సందర్భంగా పలువురు సన్మానించారు. ఎస్ వెంకటేశ్వర్లు, ఎం అర్పిత బదిలీపై వెళ్తున్న సందర్భంగా శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ నెరుమట్ల మల్లేశం, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● రామడుగు: మండలంలోని వెలిచాల గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వనమహోత్సవం జరిగింది. ఈ సందర్భంగా రెండు వేల ఈత చెట్లను నాటారు. కార్యక్రమంలో గౌడ సంఘం అద్యక్షుడు దైవాల హనుమాన్, గౌడ కులస్థులు పాల్గొన్నారు.

● వీణవంక: మండలంలోని మాట్లారెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో పాఠశాలలోని 32 మంది విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్ ప్రధానోపాధ్యాయులు రాగంపేట చంద్ర శేఖర్, మాజీ సర్పంచ్ మ్యాకల ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

● హుజూరాబాద్: హుజూరాబాద్, జమ్మికుంటలలో భ్రూణహత్యలకు పాల్పడుతున్న ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు ఆర్ రామచంద్రం అన్నారు. శుక్రవారం హుజూరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో లింగనిర్ధారణ పరీక్షలు చేసి కొంత మంది వైద్యులు బయటకు చెబుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎం శ్రీనివాస్, టి వసంత్, డి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

- హుజూరాబాద్ పట్టణంలో వాసవి, వనిత క్వీన్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ అర్చన, డాక్టర్ స్వామిరావు, క్లబ్ సభ్యులు శైలజ, హిమబిందు, స్వప్న తదితరులు పాల్గొన్నారు.
- హుజూరాబాద్: పట్టణంలోని జమ్మికుంట రోడ్ నుంచి బస్టాండ్‌కు వెళ్లే దారిలో డబ్బాను వేయగా శుక్రవారం మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. రెండ్రోజుల క్రితం బస్టాండ్‌లోకి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని బస్టాండ్ కాంప్లెక్స్ చిరువ్యాపారులు మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన మున్సిపల్ అధికారులు ఎక్స్‌కావేటర్ సహాయంతో డబ్బాను తొలగించారు.

గంగాధర: మండలంలోని గోపాల్‌రావుపల్లి గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం ఎన్నికలు శుక్రవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా నాగారపు అఖిల్ యాదవ్, ఉపాధ్యక్షుడిగా నాగారపు రవీందర్, ప్రధాన కార్యదర్శిగా ఎల్లయ్యతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు.